సాక్షి
భద్రాద్రి కొత్తగూడెం
శుక్రవారం । 26 । మే । 2023



దాహార్తి తీర్చేలా..
వన్యప్రాణుల దాహార్తి తీర్చేందుకు అటవీశాఖ ప్రత్యేక దృష్టి సారించింది. సాసర్ పిట్లు, సోలార్ పంపుసెట్లు నిర్మిస్తోంది. 8లో



బీజేపీని ఓడించడమే కర్తవ్యం
దేశానికి బీజేపీతో ప్రమాదమని, ఆ పార్టీని ఓడించడమే తమ కర్తవ్యమని ప్రజాపంథా రాష్ట్ర కార్యదర్శి పోటు రంగారావు వెల్లడించారు. 8లో

గరిష్టం / కనిష్టం
41° / 26°

వాతావరణం
జిల్లాలో శుక్రవారం అత్యధిక ఉష్ణోగ్రత నమోదవుతుంది. రాత్రి వేళ కూడా ఉక్కపోత వాతావరణమే ఉంటుంది.

న్యూస్‌రీల్

వైభవంగా రామయ్య పట్టాభిషేకం



పట్టాభిషేకం నిర్వహిస్తున్న అర్చకులు

భద్రాచలం: భద్రాచలం శ్రీసీతారామచంద్ర స్వామివారి దేవస్థానంలో పుష్యమి నక్షత్రం సందర్భంగా గురువారం స్వామివారికి వైభవంగా పట్టాభిషేకం నిర్వహించారు. తొలుత తెల్లవారుజామున గర్భగుడిలో స్వామివారికి సుప్రభాత సేవ, సేవాకాలం, ఆరాధన తదితర పూజలు చేశారు. అనంతరం స్వామివారిని బేడా మండపంలో కొలువుదీర్చి విశ్వక్సేన పూజ, పుణ్యాహవాచనం జరిపించారు. ఆ తర్వాత స్వామివారికి కంకణధారణ, యజ్ఞోపవీతధారణ, అమ్మవారికి కంకణధారణ, యోక్త్రధారణ గావించి పట్టాభిషేక వేడుకను అర్చకులు శాస్త్రోక్తంగా నిర్వహించారు. భక్తులు అధిక సంఖ్యలో హాజరై స్వామి వారిని దర్శించుకున్నారు. తీర్థ ప్రసాదాలు స్వీకరించారు.

పెద్దమ్మతల్లికి సువర్ణ పుష్పార్చన



అమ్మవారికి పూజలు నిర్వహిస్తున్న అర్చకులు

పాల్వంచరూరల్: పెద్దమ్మతల్లి అమ్మవారికి గురువారం వైభవంగా సువర్ణ పుష్పార్చన పూజలు నిర్వహించారు. మండల పరిధిలోని కేశవాపురం, జగన్నాథపురం గ్రామాల మధ్య కొలువైఉన్న శ్రీకనకదుర్గ(పెద్దమ్మతల్లి) ఆలయంలో అర్చకులు 108 సువర్ణ పుష్పార్చన, హారతి, మంత్రపుష్పం, నివేదన పూజలు జరిపారు. పూజా కార్యక్రమంలో ఆలయ పాలకవర్గ కమిటీ అధ్యక్షుడు మహిపతి రామలింగం, సభ్యులు కిలారు నాగమల్లేశ్వరరావు, గంధం వెంగళరావు, అర్చకులు పద్మనాభశర్మ, రవికుమార్‌శర్మ పాల్గొన్నారు.

ప్రశాంతంగా లాసెట్



ధ్రువపత్రాలను పరిశీలిస్తున్న సిబ్బంది

సుజాతనగర్: అబ్దుల్ కలాం ఇంజనీరింగ్ కళాశాలలో గురువారం నిర్వహించిన లాసెట్ పరీక్ష గురువారం ప్రశాంతంగా ముగిసింది. మూడు విడతల్లో జరిగిన పరీక్షకు 350 మంది అభ్యర్థులు హాజరు కావాల్సి ఉండగా, 294 మంది హాజరయ్యారు. 56 మంది గైర్హాజరయ్యారు. మొదటి సెషన్‌లో 125 మందికి 104 మంది, రెండో సెషన్‌లో 125 మందికి 105 మంది, మూడో సెషన్‌లో 100 మందికి 85 మంది హాజరైనట్లు నిర్వాహకులు తెలిపారు.

కార్పొరేట్ శాలరీ అకౌంట్లుగా మార్చుకోండి

తద్వారా రూ.40 లక్షలకు పైగా ఉచిత ప్రమాద బీమా


సూపర్‌బజార్(కొత్తగూడెం): సింగరేణి ఉద్యోగులు తమ బ్యాంకు అకౌంట్లను కార్పొరేట్ శాలరీ అకౌంట్లుగా మార్చుకుంటే రూ.40 లక్షల నుంచి రూ.50లక్షల వరకు ఉచిత బీమా వర్తిస్తుందని జీఎంలు బసవయ్య, కుమారరెడ్డి, ఎం.సుబ్బారావు వెల్లడించారు. కొత్తగూడెంలోని సింగరేణి ప్రధాన కార్యాలయంలో వివిధ బ్యాంకుల అధికారులతో గురువారం వారు సమావేశమయ్యారు. సింగరేణి కార్మికులు, అధికారులు తమ బ్యాంకు అకౌంట్లను కార్పొరేట్ సాలరీ అకౌంట్లుగా మార్చుకుంటే అమలయ్యే బీమా వివరాలను యూనియన్ బ్యాంక్ జీఎంలు హరేకృష్ణదాస్, పి.కృష్ణన్ పవర్‌పాయింట్ ప్రజెంటేషన్ ద్వారా వెల్లడించారు. ఇందుకోసం రూపాయి కూడా చెల్లించాల్సిన అవసరం లేదని తెలిపారు. అయితే, అదనంగా రూ.30 లక్షల బీమా కోసం ఏటా రూ.313 చెల్లించాల్సి ఉంటుందని, తద్వారా రూ.85 లక్షల బీమా అమలవుతుందని వివరించారు. అంతేకాకుండా జీరో బ్యాలెన్స్ అకౌంట్, ఇళ్లు, వాహన రుణాలు వర్తిస్తాయని తెలిపారు. ఈ సమీక్షలో సింగరేణి అధికారులు కవితానాయుడు, కె.శ్రీనివాసరావు, జీ.వీ.కిరణ్‌కుమార్, కొమరయ్య, పి.రాజేశ్వర్, ఎస్.వీ.రావు, ముకుంద సత్యనారాయణ, శివకుమార్, బ్యాంకు అధికారులు హన్మంతరెడ్డి, అమిత్‌శర్మ, జి.కిషన్, కె.నవీన్ పాల్గొన్నారు.

నిల్వ నీరు.. బేజారు!





జ్వరంతో బాధపడుతున్న మహిళ



కూలర్ నీటిలో పెరిగిన లార్వా

లక్ష్మీదేవిపల్లి మండలం చింతవర్రెలో నిర్వహిస్తున్న వైద్య శిబిరం

దోమలకు నిలయంగా కూలర్లు

- ఎండాకాలంలో పెరుగుతున్న విషజ్వరాలు
- మంచం పడుతున్న ఏజెన్సీ పల్లెలు

సాక్షి ప్రతినిధి, భద్రాద్రి కొత్తగూడెం: వేసవిలో ఎండ వేడిమి నుంచి ఉపశమనం కలిగించే కూలర్లు ఏజెన్సీ ఏరియాలో ప్రమాదకరంగా మారుతున్నాయి. కూలర్లలో నీటిని ఎప్పటికప్పుడు మార్చడంలో ఆలస్యం చేస్తే అవి దోమల ఉత్పత్తి కేంద్రాలుగా తయారవుతున్నాయి. ఫలితంగా అంటు వ్యాధులు ప్రబలుతున్నాయి. ఈ తరహా ఘటనలు గోదావరి తీరంలో ముఖ్యంగా భద్రాద్రి జిల్లాలో వరుసగా చోటు చేసుకుంటున్నాయి. సాధారణంగా వర్షాకాలం ప్రారంభమైన తర్వాత గ్రామీణ, ఏజెన్సీ ప్రాంతాల్లో అంటు వ్యాధులు, విషజ్వరాలు విజృంభిస్తుంటాయి. కానీ నడి వేసవిలో ఏజెన్సీ పల్లెలు విషజ్వరాలతో వణికిపోతున్నాయి. లక్ష్మీదేవిపల్లి, చర్ల మండలాల్లో కొన్ని గ్రామాలు వారం రోజులుగా విష జ్వరాలతో మంచం పట్టాయి. దీంతో ఆయా గ్రామాల్లో వరుసగా వైద్య శిబిరాలు ఏర్పాటు చేయాల్సి వచ్చింది.

కూలర్లలో లార్వా..

ఈసారి వేసవిలో వాతావరణం గతానికి భిన్నంగా నమోదవుతోంది. మండుటెండలు ఉండాల్సిన వేసవిలో వర్షాలు సర్వసాధారణమయ్యాయి. ఒకటి రెండు రోజులు ఠారెత్తించే ఎండలు కొడితే ఈ తర్వాత కొన్ని రోజులు ఉరుములు, మెరుపులు, ఈదురు గాలులతో కూడిన వర్షాలు పడుతున్నాయి. దీంతో ఎండ వేడిమి నుంచి ఉపశమనం కోసం ఉపయోగించే కూలర్లలో నీటిని ఎప్పటికప్పుడు మార్చాల్సిన అవసరం తగ్గుతోంది. మరోవైపు భానుడి ప్రతాపం తగ్గినప్పుడు కరెంటు బిల్లులు ఆదా చేసేందుకు కూలర్ల బదులు ఫ్యాన్లు ఉపయోగిస్తుంటారు. ఫలితంగా కూలర్లలో ఉంచిన నీరు ఎక్కువ కాలం నిల్వ ఉండి, దోమల లార్వా పెరిగేందుకు అవకాశం కలుగుతోంది. ఇలా పెరిగిన దోమల కారణంగా ఏజెన్సీలోని గ్రామాలు జ్వరపు కోరల్లో చిక్కుకుంటున్నాయి. జిల్లాలోని చర్ల మండల కేంద్రం, లక్ష్మీదేవిపల్లి మండలం చింతవర్రె గ్రామాలు విష జ్వరాలతో అల్లాడుతున్నాయి. ప్రతీ ఇంట్లో ఒకరిద్దరు ఒళ్లు నొప్పులు, జ్వరంతో బాధ పడుతున్నారు. ఇప్పటికే ప్రైవేటు ఆస్పత్రుల్లో చేసిన రోగ నిర్ధారణ పరీక్షల్లో నలుగురు డెంగీ బారిన పడ్డట్టుగా తేలింది. దీంతో జిల్లా వైద్యాశాఖ ఆధ్వర్యంలో చింతవర్రె గ్రామంలో ప్రత్యేక హెల్త్ క్యాంపు నిర్వహించి గ్రామస్తుల నుంచి రక్త నమూనాలు సేకరించారు. కాగా గత మంగళవారమే కరకగూడెం మండలంలో ఓ మహిళ డెంగీతో మరణించింది.

కూలర్లలో నీళ్లు ఖాళీ..

చింతవర్రె గ్రామాన్ని వైద్య బృందం సందర్శించగా ప్రతీ ఇంట్లో బాధితులు కనిపించారు. నడి వేసవిలో ఈ స్థాయిలో జ్వరాలు ఉండడం చూసి వైద్యాధికారులే విస్తుపోయారు. గ్రామాన్ని క్షుణ్ణంగా పరిశీలించి కూలర్లలో ఉంచిన నీరు దోమల పెరుగుదలకు దోహదం చేస్తున్నట్టుగా గుర్తించారు. దీంతో గ్రామంలోని ప్రతీ ఇంటికి వెళ్లి కూలర్లలో నీటిని మార్పించారు. అవసరం ఉన్నా లేకున్నా మూడు నుంచి నాలుగు రోజులకు ఓసారి నీటిని పూర్తిగా మార్చాలని సూచించారు.

వారంలో రూ. 50 వేల ఖర్చు



వారం రోజుల కిందట నాకు ఒళ్లు నొప్పులతో కూడిన జ్వరం వచ్చింది. ఆ వెంటనే నా భర్త, కూతురు, అల్లుడు, మనుమలు కూడా జ్వరం బారిన పడ్డారు. వైద్య చికిత్స కోసం ఆస్పత్రులకు వెళితే వారం రోజుల్లోనే రూ.50 వేల వరకు ఖర్చయింది. ఏడాది పాటు పొదుపు చేసుకున్న సొమ్ము ఈ జ్వరాలకే పోయింది. – ఈసం ఈశ్వరమ్మ, చింతవర్రె

వైద్య సేవలపై డీఎంహెచ్ఓ ఆరా

కొత్తగూడెంరూరల్: లక్ష్మీదేవిపల్లి మండలం మైలారం గ్రామ పంచాయతీ పరిధిలోని చింతవర్రె గామంలో జర్వ పీడితులను జిల్లా వైద్య, ఆరోగ్య శాఖ అధికారి డాక్టర్ జేవీఎల్ శిరీష గురువారం పరిశీలించారు. గ్రామంలో ఎందరు జ్వరాల బారిన పడ్డారు, అందుతున్న వైద్యసేవల గురించి వైద్య శిబిరంలో విధులు నిర్వహిస్తున్న డాక్టర్ స్వప్నను అడిగి తెలుసుకున్నారు. బాధితులకు మెరుగైన వైద్య సేవలు అందించాలని, మరో రెండు రోజుల పాటు శిబిరం కొనసాగించాలని సూచించారు. గ్రామంలో ఇంటింటి సర్వే చేయాలని చెప్పారు. కార్యక్రమంలో జిల్లా ఉప ఆరోగ్యశాఖ అధికారి సుకృత, రేగళ్ల సబ్ యూనిట్ అధికారి హరికృష్ణ, మలేరియా టెక్నికల్ సూపర్‌వైజర్ చైతన్య తదితరులు పాల్గొన్నారు.



జ్వర పీడితులకు చికిత్సను పరిశీలిస్తున్న డీఎంహెచ్ఓ డాక్టర్ శిరీష

అంగన్‌వాడీ కేంద్రాల్లో కిచెన్ గార్డెన్లు

జిల్లా స్త్రీ, శిశు సంక్షేమాధికారి సబిత



బసవతారక కాలనీలో కిచెన్ గార్డెన్‌లోని మొక్కలను పరిశీలిస్తున్న సబిత

పాల్వంచరూరల్ : ప్రతీ అంగన్‌వాడీ కేంద్రంలో కిచెన్ గార్డెన్ ఏర్పాటు చేయాలని జిల్లా స్త్రీ, శిశు సంక్షేమాధికారి(డీడబ్ల్యూఓ) సబిత అంగన్‌వాడీ టీచర్లను ఆదేశించారు. మండల పరిధిలోని బస్వతారక కాలనీలోని పాల్వంచ ప్రాజెక్టు ఐసీడీఎస్ సీడీపీఓ కార్యాలయంలో గురువారం ఆమె సిబ్బంది హాజరు రిజిస్టర్లను తనిఖీ చేశారు. కార్యాలయ ఆవరణలో ఏర్పాటు చేసిన కిచెన్ గార్డెన్ చూసి సంతృప్తి వ్యక్తం చేశారు. ప్రీ స్కూల్ పిల్లల హాజరు శాతం పెంచాలని సిబ్బందికి సూచించారు. ఆయా పిల్లలున్న కుటుంబాలను సూపర్‌వైజర్లు, అంగన్‌వాడీ టీచర్లు, సీడీపీఓలు సందర్శించి వారంతా కేంద్రాలకు వచ్చేలా చర్యలు చేపట్టాలన్నారు. అంగన్‌వాడీ కేంద్రాల్లో కిచెన్ గార్డెన్‌ల ఏర్పాటుతో ఆకుకూరలు, కూరగాయల మొక్కలను పెంచవచ్చని, తద్వారా చిన్నారులతో పాటు గర్భిణులు, బాలింతలకు మెరుగైన ఆహారం అందించవచ్చని చెప్పారు.

ఔట్‌రిచ్ వర్కర్ పోస్టుకు దరఖాస్తుల ఆహ్వానం..

కొత్తగూడెంటౌన్: జిల్లా సంక్షేమ శాఖలో కాంట్రాక్ట్ పద్ధతిలో ఔట్ రిచ్ వర్కర్‌గా పని చేసేందుకు పురుష అభ్యర్థుల నుంచి దరఖాస్తులు ఆహ్వానిస్తున్నట్లు డీడబ్ల్యూఓ ఎం.సబిత గురువారం ఒక ప్రకటనలో తెలిపారు. మొదట దరఖాస్తు గడువు ఈనెల 20 వరకే ఉండగా, ఇప్పుడు జూన్ 5 వరకు పొడిగించినట్లు పేర్కొన్నారు. డిగ్రీ (సోషల్ వర్క్, చైల్డ్ డెవలప్‌మెంట్ వారికి ప్రాధాన్యత) విద్యార్హత కలిగి 21 నుంచి 35 ఏళ్ల లోపు వారు దరఖాస్తు చేసుకోవాలని సూచించారు. ఎస్సీ, ఎస్టీ, బీసీలకు ఐదేళ్ల సడలింపు ఉంటుందని తెలిపారు. ఆసక్తి గల వారు జూన్ 5 లోపు జిల్లా సంక్షేమ శాఖ కార్యాలయంలో దరఖాస్తులు సమర్పించాలని కోరారు.

ధాన్యం కొనుగోలు చేయాలని రైతుల రాస్తారోకో



రైతులతో మాట్లాడుతున్న అదనపు కలెక్టర్ వెంకటేశ్వర్లు

అశ్వాపురం: 1121 రకం ధాన్యం కొనుగోలు చేయాలని, కాంటాలు పెట్టిన ధాన్యం వెంటనే మిల్లులకు తరలించాలని డిమాండ్ చేస్తూ మండల పరిధిలోని గొల్లగూడెంలో మణుగూరు–కొత్తగూడెం ప్రధాన రహదారిపై గురువారం రైతులు రాస్తారోకో చేశారు. సుమారు గంటపాటు సాగిన ఆందోళనతో ట్రాఫిక్ భారీగా స్తంభించింది. ఈ సందర్భంగా రైతులు మాట్లాడుతూ 1121 రకం విత్తనాలను ప్రభుత్వమే ఇచ్చిందని, ఇప్పుడు ధాన్యం కొనకుంటే తమ పరిస్థితి ఏంటని ప్రశ్నించారు. ఇక కొనుగోలు కేంద్రాల్లో ధాన్యం కాంటా పెట్టి రోజులు గడుస్తున్నా లారీలు రాక మిల్లులకు తరలించడం లేదని ఆవేదన వ్యక్తం చేశారు. రాస్తారోకో విషయం తెలియగానే అదనపు కలెక్టర్ కె.వెంకటేశ్వర్లు అక్కడికి చేరుకుని అశ్వాపురం, నెల్లిపాక సహకార సంఘాల పరిధిలోని అన్ని కొనుగోలు కేంద్రాల్లో అన్ని రకాల ధాన్యం తీసుకుంటామని, కాంటాలు పెట్టిన ధాన్యాన్ని రెండు, మూడు రోజుల్లో మిల్లులకు తరలిస్తామని హామీ ఇవ్వడంతో ఆందోళన విరమించారు. పినపాక నియోజకవర్గ కాంగ్రెస్ నాయకుడు గాదె కేశవరెడ్డి రైతులకు మద్దతు తెలిపారు.

ప్రభుత్వాస్పత్రిలో పరిశీలన



వార్డులో వివరాలు తెలుసుకుంటున్న అధికారులు

ఇల్లెందు: పట్టణంలోని ప్రభుత్వాస్పత్రిని ఆరోగ్యశ్రీ జిల్లా అధికారి డాక్టర్ గోపి, జిల్లా మేనేజర్ డాక్టర్ శ్రీనివాస్ గురువారం రాత్రి సందర్శించారు. డయాలసిస్ వార్డును పరిశీలించారు. జనరల్ వార్డును పరిశీలించి రోజువారీ ఆక్యుపెన్సీ వివరాలు అడిగి తెలుసుకున్నారు. ఈ కార్యక్రమంలో ఆస్పత్రి సూపరింటెండెంట్ శిరీష్‌కుమార్, సిబ్బంది పాల్గొన్నారు.

వేజ్‌బోర్డ్ సభ్యుడిగా 'సానికొమ్ము'



విప్ రేగాకు కృతజ్ఞతలు తెలుపుతున్న శంకర్‌రెడ్డి

బూర్గంపాడు: సారపాకకు చెందిన బీఆర్‌టీయూ జిల్లా అధ్యక్షుడు సానికొమ్ము శంకర్‌రెడ్డి రాష్ట్ర కనీస వేతనాల మండలి(వేజ్ బోర్డ్) సభ్యుడిగా నియమితులయ్యారు. ఈ మేరకు రాష్ట్ర ప్రభుత్వం విడుదల చేసిన జాబితాలో శంకర్‌రెడ్డికి స్థానం దక్కింది. తన నియామకానికి సహకరించిన ప్రభుత్వ విప్ రేగా కాంతారావును గురువారం శంకర్‌రెడ్డి, అతని అనుచరులు కలిసి కృతజ్ఞతలు తెలిపారు.

సమగ్ర అవగాహన అవసరం

అదనపు కలెక్టర్ వెంకటేశ్వర్లు



మాట్లాడుతున్న అదనపు కలెక్టర్ వెంకటేశ్వర్లు

సూపర్‌బజార్(కొత్తగూడెం): ప్రజలు వినియోగించే వస్తువులు బీఐఎస్(బ్యూరో ఆఫ్ ఇండియన్ స్టాండర్డ్స్) ప్రమాణాల మేరకు ఉన్నాయా లేవా అనే దానిపై ప్రతి ఒక్కరూ అవగాహన కలిగి ఉండాలని అదనపు కలెక్టర్ కె.వెంకటేశ్వర్లు అన్నారు. బ్యూరో ఆఫ్ ఇండియన్ స్టాండర్డ్స్‌పై గురువారం ఐడీఓసీలో నిర్వహించిన సమావేశంలో ఆయన మాట్లాడారు. భారత ప్రామాణిక సంస్థ సర్టిఫికేషన్, దాని ప్రాముఖ్యత, దేశ వ్యాప్తంగా వ్యవసాయ, పరిశ్రమలు వంటి వివిధ రంగాల్లో తయారయ్యే వస్తువులకు బీఐఎస్ జారీ చేసే నాణ్యతా ప్రమాణాల కోడ్స్ గురించి వివరించారు. బంగారం, వెండి నాణ్యతా ప్రమాణాల హాల్‌మార్క్ గురించి బీఐఎస్ జాయింట్ డైరెక్టర్ సుజాత తెలియజేశారు. దేశ వ్యాప్తంగా వివిధ రంగాల్లో 21,675 ఉత్పత్తులను బీఐఎస్ నాణ్యతా ప్రమాణాల పరిధిలోకి తెచ్చినట్లు చెప్పారు. దేశంలో 1107 ఉత్పత్తుకు బీఐఎస్ సర్టిఫికేషన్ జారీ చేయగా, 459 ఉత్పత్తులకు తప్పనిసరి సర్టిఫికేషన్ జారీ చేసినట్లు తెలిపారు. దరఖాస్తు చేసుకున్న 30 రోజుల్లోగా లైసెన్స్‌లు జారీ చేస్తామని, గడువు ముగియగానే రెన్యువల్ చేయించుకోవాలని సుజాత చెప్పారు. బీఐఎస్ లైసెన్స్ లేకుండా వస్తు ఉత్పత్తులు తయారు చేయడం నిషేధమని, వివిధ వస్తువులపై ప్రమాణాలు పాటించకుంటే వాటిని సీజ్ చేయడంతో పాటు తయారీదారులకు జరిమానా, జైలుశిక్ష పడుతుందని హెచ్చరించారు. ఈ విషయంలో సలహాల కోసం వినియోగదారులు 7382492833, 7386430420 నంబర్లకు ఫోన్ చేయవచ్చని సూచించారు. బీఐఎస్ సిబ్బంది కృష్ణవీర్‌వర్మ, ఎ.అనూప్‌కుమార్ వస్తు ఉత్పత్తి, వినియోగానికి పాటించాల్సిన ప్రమాణాలపై పవర్‌పాయింట్ ప్రజెంటేషన్ ద్వారా వివరించారు. సమావేశంలో జిల్లా పౌరసరఫరాల అధికారి మల్లికార్జున్ తదితరులు పాల్గొన్నారు.

సీఎం సమావేశంలో కలెక్టర్, ఎస్పీ



తెలంగాణ రాష్ట్ర ఆవతరణ దశాబ్ది ఉత్సవాల నిర్వహణపై హైదరాబాద్‌లోని సెక్రటేరియట్‌లో గురువారం సీఎం కేసీఆర్ అధ్యక్షతన నిర్వహించిన సమావేశానికి కలెక్టర్ అనుదీప్, ఎస్పీ వినీత్ హాజరయ్యారు. – సూపర్‌బజార్(కొత్తగూడెం)

వృక్ష సంపదను కాపాడాలి



పర్యావరణ పరిరక్షణపై ప్రతిజ్ఞ చేస్తున్న సీఈ, ఇంజనీర్లు

పాల్వంచ: సమాజంలో ప్రతీ ఒక్కరు పర్యావరణంపై అవగాహన పెంపొందించుకుని వృక్ష సంపదను కాపాడాలని కేటీపీఎస్ 5, 6వ దశల సీఈ ఎం.ప్రభాకర్‌రావు అన్నారు. అంతర్జాతీయ పర్యావరణ దినోత్సవాన్ని పురస్కరించుకుని గురువారం పాల్వంచలోని 5, 6వ దశల కర్మాగారంలో మొక్కలు నాటే కార్యక్రమాన్ని సీఈ ప్రారంభించారు. అనంతరం ఉద్యోగులతో పర్యావరణ పరిరక్షణపై ప్రతిజ్ఞ చేయించాక ఆయన మాట్లాడారు. కొత్తగూడెం పొల్యూషన్ కంట్రోల్ బోర్డ్ ఎన్విరాన్‌మెంట్ ఇంజనీర్ ఎస్.వెంకటేశ్, అసిస్టెంట్ సైంటిస్ట్ జి.లింగయ్య, ఎస్ఈలు వి.వెంకటేశ్వర్లు, టి.సత్యనారాయణ, జీ.వీ.ధర్మారావు, కృష్ణ, మోక్షవీర్, డీవైసీసీఏ పి.రామారావు, ఈఈ టి.సుధాకర్ పాల్గొన్నారు.

అభయారణ్యంలో అభివృద్ధి పనుల తనిఖీ



చెక్‌డ్యామ్ పనులను తనిఖీ చేస్తున్న భీమానాయక్

కొత్తగూడెంరూరల్ : కిన్నెరసాని అభయారణ్యం పరిధిలోని చాతకొండ రేంజ్‌లో చీఫ్ కన్జర్వేటర్ ఆఫ్ ఫారెస్ట్ (సీసీఎఫ్) భీమానాయక్ గురువారం పర్యటించారు. అటవీ ప్రాంతంలో నిర్మించిన చెక్‌డ్యామ్‌లు, ప్లాంటేషన్, బీడీ ఆకు కల్లాలను పరిశీలించారు. ఆయన వెంట వైల్డ్‌లైఫ్ ఎఫ్‌డీఓ కట్టా దామోదర్ రెడ్డి, రేంజర్ శ్రీనివాసరెడ్డి ఉన్నారు.

క్లుప్తంగా

పోడు భూములపై విచారణ



పోడు భూముల్లో విచారణ చేస్తున్న ఆర్డీఓ స్వర్ణలత

అశ్వారావుపేటరూరల్: పోడు భూములపై కొత్తగూడెం ఆర్డీఓ స్వర్ణలత గురువారం విచారణ నిర్వహించారు. మండల పరిధిలోని ఆసుపాక, ఊట్లపల్లి పంచాయతీ వాగొడ్డుగూడెం గ్రామాల గిరిజనులు గతంలో పోడు పట్టాల కోసం దరఖాస్తు చేసుకున్నారు. కాగా ఈ భూముల్లో గిరిజనులు సాగులో లేరంటూ అటవీ శాఖకు, గిరిజనుల మధ్య వివాదం నేపథ్యంలో అధికారులు పరిశీలించలేదు. దీంతో రైతులు వేర్వేరుగా హైకోర్టును ఆశ్రయించగా, ఆర్డీఓ, ఐటీడీఏ పీఓ, ఎఫ్‌డీఓ, ఎఫ్ఆర్ఓ, ఆర్ఓఎఫ్ఆర్ కమిటీ బాధ్యులు క్షేత్రస్థాయిలో విచారణ చేసి నివేదిక సమర్పించాలని న్యాయస్థానం ఆదేశించింది. ఈ క్రమంలో కొత్తగూడెం ఆర్డీఓ, ఫారెస్ట్ రేంజర్, తహసీల్దార్ లూథరన్ విల్సన్ ఆధ్వర్యంలో విచారణ చేశారు. నివేదికను న్యాయస్థానానికి అందిస్తామని ఆర్డీఓ తెలిపారు. ఈ విచారణలో సర్పంచ్‌లు సాధు జ్యోత్స్నబాయి, కునసోతు లింగయ్య, ఎంపీడీఓ శ్రీనివాసరావు, పంచాయతీ కార్యదర్శులు శ్యాం, మోతీలాల్, అటవీ సిబ్బంది పాల్గొన్నారు.

బంగారు గొలుసు అపహరణ

బూర్గంపాడు: మండల పరిధిలోని లక్ష్మీపురం గ్రామంలో బుధవారం రాత్రి నిద్రిస్తున్న మహిళ మెడలోని నానుతాడును దొంగలు అపహరించారు. బాధితుల కథనం ప్రకారం... గ్రామానికి చెందిన కేతినేని వీరబాబు భార్య తన ఇంట్లో ఆరుబయట నిద్రిస్తోంది. అర్ధరాత్రి సమయంలో గుర్తు తెలియని వ్యక్తులు ఆమె మెడలోని నానుతాడును కత్తిరించుకుని వెళ్తుండగా మేల్కొని కేకలు వేసింది. ఆమె భర్త, ఇరుగుపొరుగు వారు వెంబడించినా దొంగలు పరారయ్యారు. సుమారు రూ.70వేల విలువైన బంగారు తాడు అపహరణకు గురైనట్లు బాధితులు పోలీసులకు ఫిర్యాదు చేశారు.

మంత్రిని దూషించిన వ్యక్తిపై కేసు

ఖమ్మంఅర్బన్: రాష్ట్ర రవాణా శాఖ మంత్రి పువ్వాడ అజయ్‌కుమార్, ఆయన తండ్రి నాగేశ్వరరావును సామాజిక మాధ్యమాల వేదికగా దూషించిన వ్యక్తిపై కేసు నమోదైంది. భద్రాద్రి కొత్తగూడెం జిల్లాకు చెందిన కార్తీక్ ఫేస్‌బుక్‌లో మంత్రిని దూషిస్తూ కామెంట్లు పెట్టడంతో బీఆర్ఎస్ నాయకులు ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేశామని ఖమ్మం అర్బన్ పోలీసులు తెలిపారు.

వడదెబ్బతో ఇద్దరు మృతి

పాల్వంచ: జిల్లాలో గురువారం వడదెబ్బతో ఇద్దరు మృతి చెందారు. పాల్వంచ పట్టణంలోని వెంగళరావు కాలనీకి చెందిన సుతారీ పని చేసుకునే భూక్యా బాలాజీ నాయక్ (50) వడదెబ్బ తగిలి అస్వస్థతకు గురయ్యాడు. దీంతో చికిత్స పొందుతున్నాడు. ఈ క్రమంలో గురువారం మృతి చెందాడు. మృతునికి భార్య రంగమ్మ, కుమారుడు, కూతురు ఉన్నారు.

చుంచుపల్లిలో..



చిన్ని మృతదేహం

చుంచుపల్లి: కొత్తగూడెంలోని ఎ.పవర్‌హౌస్ బస్తీకి చెందిన సంటి చిన్ని(35) వడదెబ్బతో గురువారం మృతి చెందాడు. చుంచుపల్లి కొత్త పోలీస్ స్టేషన్ సమీపంలో మృతదేహం ఉండగా, స్థానికులు గమనించి పోలీసులకు సమాచారం అందించారు. పోలీసులు సంఘటనా స్థలానికి చేరుకుని మృతదేహాన్ని పరిశీలించి వివరాలు సేకరించారు. విచారణ జరిపి సంటి చిన్నిగా గుర్తించారు. కాగా చిన్ని రోజువారీ కూలి.


రోడ్డు ప్రమాదంలో ఒకరు..

బూర్గంపాడు: మండలంలోని మోరంపల్లిబంజర గ్రామంలో గురువారం జరిగిన రోడ్డు ప్రమాదంలో ఓ వ్యక్తి మృతిచెందాడు. పోలీసుల కథనం ప్రకారం.. మోరంపల్లిబంజర గ్రామానికి చెందిన సోము గురువారెడ్డి(65) గురువారం రోడ్డుపై నడుచుకుంటూ ఇంటికి వెళ్తున్న క్రమంలో పాల్వంచ నుంచి బూర్గంపాడు వైపు వెళ్తున్న బొలెరో వాహనం ఢీ కొట్టింది. దీంతో తీవ్ర గాయాలై అపస్మారక స్థితిలోకి చేరుకున్నాడు. స్థానికులు చికిత్స నిమిత్తం పీహెచ్‌సీకి తరలిస్తుండగా గురువారెడ్డి మృతిచెందాడు. మృతదేహాన్ని బూర్గంపాడు ప్రభుత్వ ఆస్పత్రికి తరలించి శవపంచనామా నిర్వహించారు. మృతునికి భార్య, ఇద్దరు కుమారులున్నారు. మృతుని భార్య ఫిర్యాదు మేరకు పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

వ్యక్తిపై కేసు నమోదు

భద్రాచలంఅర్బన్: పట్టణంలోని ఆదర్శనగర్ కాలనీకి చెందిన ఓ వివాహిత పట్ల అదే ప్రాంతానికి చెందిన ఉపేందర్ అనే వ్యక్తి అసభ్యంగా ప్రవర్తిస్తున్నాడు. గురువారం బాధితురాలి భర్త ఫిర్యాదు చేయగా పోలీసులు కేసు నమోదు చేశారు.

పామాయిల్ గెలలు



టన్ను ధర	రూ.14,205

దాహార్తి తీర్చేలా..



తొట్లలో నీరు నింపుతున్న అటవీశాఖ సిబ్బంది

- వన్యప్రాణుల కోసం నీటితొట్ల ఏర్పాటు
- అటవీ ప్రాంతంలో రూ.12.52 లక్షలతో 119 తొట్లు
- ఈ ఏడాది అదనంగా మరో ఎనిమిది..



తొట్లలో నీరు తాగుతున్న వన్యప్రాణులు

పాల్వంచరూరల్: వేసవి కాలంలో వన్యప్రాణుల దాహార్తి కోసం అల్లాడుతాయి. అటవీ ప్రాంతంలో నీటి వనరులు అడుగంటిపోవడంతో తాగునీటి కోసం వ్యవసాయ బావులు, బోర్లు, గ్రామాల పరిసరాలకు వచ్చి ప్రమాదాల బారిన పడుతున్నాయి. ఈ నేపథ్యంలో అటవీశాఖ ప్రత్యేక దృష్టి సారించి వన్యప్రాణులకు తాగునీరు అందించే చర్యలు చేపట్టింది. అటవీ ప్రాంతంలో సాసర్ పిట్లు, సోలార్ పంపుసెట్లు, నీటికుంటలు, చెక్‌డ్యామ్‌లు నిర్మిస్తోంది. దీంతో వన్యప్రాణులకు దాహార్తి తీరడంతోపాటు భూగర్భ జలాలు పెరుగుతున్నాయి.

కంపా నిధులతో నీటితొట్లు

జిల్లాలోని అటవీ ప్రాంతంలో జంతువులకు తాగునీటి సౌకర్యం కల్పించేందుకు కాంపన్సేటరీ అఫ్ఫారెస్టేషన్ ఫండ్ మేనేజ్‌మెంట్ అండ్ ప్లానింగ్ అథారిటీ(కంపా) నిధులతో నీటితొట్లు ఏర్పాటు చేశారు. ఆరు అటవీశాఖ డివిజన్ల పరిధిలో రూ.12.52 లక్షలతో 119 తొట్లు నిర్మించారు. ఈ ఏడాది వైల్డ్‌లైఫ్(కిన్నెరసాని) డివిజన్‌లో రూ.1.06 లక్షలతో 8 నీటితొట్లను ఏర్పాటు చేశారు. గతేడాది రూ.4.06లక్షలతో 31 తొట్లు నిర్మించారు. కిన్నెరసాని అభయారణ్యంలోని యానంబైల్, చాతకొండ, ఆళ్లపల్లి, కరకగూడెం రేంజ్‌ల పరిధిలోని 74 బీట్లలో వీటిని ఏర్పాటు చేశారు. 2021-2022, 2022-2023 సంవత్సరాల్లో జిల్లాలోని కొత్తగూడెం, ఇల్లెందు, పాల్వంచ, మణుగూరు, భద్రాచలం, పాల్వంచ వైల్డ్‌లైఫ్ డివిజన్లలో నీటితొట్ల నిర్మాణం చేపట్టారు. దీంతో రెండు, మూడేళ్ల నుంచి వన్యప్రాణులకు తాగునీటి సమస్య లేకుండా పోయింది. వేసవికాలం ముగిసేవరకు ట్రాక్టర్ల ట్యాంకర్ల ద్వారా తొట్లలో నీటిని నింపుతున్నారు.

అన్ని సీజన్లలో తాగునీరు..



అటవీ ప్రాంతంలో జంతువులకు అన్ని సీజన్లలో తాగునీటిని అందుబాటులో ఉంచేవిధంగా నీటితొట్లు ఏర్పాటు చేశాం. సోలార్ పంపుసెట్ల తోపాటు అదనంగా చెక్‌డ్యామ్‌లు, నీటి కుంటల నిర్మాణం చేపట్టాం. దీంతో గతంలో లాగా నీటి కోసం వన్యప్రాణులు అటవీ వెలుపలకు రావడంలేదు.

– రంజిత్ లక్ష్మణ్‌నాయక్, డీఎఫ్ఓ

సంరక్షణకు ప్రత్యేక దృష్టి



వేసవికాలంలో వన్యప్రాణులకు తాగునీటి సౌకర్యం కల్పించేందుకు కంపా నిధులతో గతేడాది 31 నీటి తొట్లు, 22 సోలార్ పంపుసెట్లను ఏర్పాటు చేశాం. ఈ సంవత్సరం మరో 8 నీటి తొట్లు నిర్మించాం. వర్షాలు కురిసేవరకు ట్రాక్టర్ల ట్యాంకర్లతో నీటిని తరలించి తొట్లు నింపుతున్నాం. ప్రత్యేకంగా సిబ్బందిని ఏర్పాటు చేశాం.

– కె.దామోదర్‌రెడ్డి, వైల్డ్‌లైఫ్ ఎఫ్‌డీఓ

ఎంసెట్‌లో 'నలంద'కు రాష్ట్రస్థాయి ర్యాంకులు



విద్యార్థులను అభినందిస్తున్న కళాశాల సీఈఓ చైతన్యకృష్ణ, తదితరులు

కొత్తగూడెంరూరల్: టీఎస్ ఎంసెట్ ఫలితాల్లో తమ విద్యార్థులు రాష్ట్ర స్థాయిలో ర్యాంకులు సాధించి విజయకేతనం ఎగురవేశారని కొత్తగూడెంలోని నలంద జూనియర్ కళాశాల చైర్మన్ ఎం.వీ.చౌదరి, సీఈఓ ఎం.చైతన్యకృష్ణ వెల్లడించారు. ఉత్తమ ర్యాంకులు సాధించిన విద్యార్థులను గురువారం అభినందించిన అనంతరం వారు మాట్లాడారు. మెడికల్, అగ్రికల్చర్ విభాగంలో నామాని సిరి రాష్ట్ర స్థాయిలో 448 ర్యాంకు, మొగులోజు స్పందన 1,340 ర్యాంకులు సాధించారని తెలిపారు. అలాగే, ఇంజనీరింగ్ విభాగంలో ముగిడి వెంకటలక్ష్మి 1,356 ర్యాంకు, పొన్నం భావన 4,634వ ర్యాంకు, యశశ్రీ 5,847 ర్యాంకులతో పాటు 10వేల ర్యాంకుల లోపు మొత్తం 12 మంది విద్యార్థులు సాధించారని చెప్పారు. అధ్యాపకుల నిరంతర పర్యవేక్షణ, విద్యార్థులు క్రమశిక్షణతో చదువుకోవడం వల్లే ఈ విజయాలు సాధ్యమయ్యాయని తెలిపారు. కార్యక్రమంలో కళాశాల ప్రిన్సిపాల్ ఐ.వీ.మల్లికార్జునరావు, అధ్యాపకులు పాల్గొన్నారు.

మూఢ నమ్మకాలను నిర్మూలించాలి



అవగాహన సదస్సులో భానుప్రసాద్, చార్వాక, నబీసాహెబ్, సుభాని

అశ్వాపురం: మూఢ నమ్మకాల నిర్మూలనకు ప్రభుత్వం ప్రత్యేక చట్టం తేవాలని తెలంగాణ హేతువాద సంఘం రాష్ట్ర నాయకుడు డాక్టర్ భానుప్రసాద్, శాస్త్రీయ అధ్యయన వేదిక రాష్ట్ర కన్వీనర్ చార్వాక కోరారు. గురువారం మండల పరిధిలోని గొంది గూడెం కొత్తూరు గ్రామ పంచాయతీ వలస ఆదివాసీ గ్రామం గుండ్లమడుగులో నిర్వహించిన అవగాహన సదస్సులో వారు మాట్లాడారు. శాస్త్రీయ అధ్యయన వేదిక రాష్ట్ర కన్వీనర్ చార్వాక కొబ్బరికాయ నుంచి రక్తం రావడం, నిమ్మకాయ నుంచి రక్తం కారడం, మంచినీటిని పెట్రోల్‌గా చేసి మండించడం వంటి ప్రయోగాలు చేసి, అందులో ఉన్న శాస్త్రీయతను వివరించారు. మూఢనమ్మకాలతో మోసపోవద్దని సూచించారు. ఇటీవల గ్రామంలో మంత్రాలు, చేతబడి నెపంతో స్థానికుల చేతిలో దాడికి గురైన మడివి లక్ష్మయ్య కుటుంబసభ్యులను పరామర్శించారు. అనారోగ్యానికి గురైతే ఆస్పత్రిలో చికిత్స పొందాలని, చేతబడి, మంత్రాలు చేశారని నమ్మి మోసపోవద్దన్నారు. ఈ కార్యక్రమంలో శాస్త్రీయ అధ్యయన వేదిక జిల్లా కన్వీనర్ ఎస్‌కే.నబీ సాహెబ్, గ్రామీణ వైద్యులు సుభాని, నరసింహారావు, మమతా మెడికల్ కాలేజీ మెడికో విద్యార్థి బన్నీ, టీజేఎస్ నాయకులు కరుణాకర్‌రెడ్డి, అరవింద్ తదితరులు పాల్గొన్నారు.

యువత రాజకీయాల్లోకి రావాలి

ఎంపీ నామా నాగేశ్వరరావు



యువకులతో ఫొటో దిగుతున్న ఎంపీ నామా

చంద్రుగొండ : రాజకీయాల్లో యువరక్తం రావాలని ఎంపీ నామా నాగేశ్వరరావు పేర్కొన్నారు. మండలంలోని మద్దుకూరు గ్రామంలో గురువారం పలు ప్రైవేటు కార్యక్రమాల్లో పాల్గొన్న ఆయన గ్రామంలోని యువకులతో మాట్లాడారు. స్థానికంగా ఉన్న సమస్యలను అడిగి తెలుసుకున్నారు. అనంతరం యువకులనుద్దేశించి మాట్లాడుతూ గ్రామ సమస్యలను పరిష్కరించే వారికి ప్రజల్లో తగిన గుర్తింపు ఉంటుందన్నారు. యువకులు గ్రామాల్లో సమస్యలపై స్పందించి ప్రజాప్రతినిధులు, అధికారులు దృష్టికి తీసుకెళ్లాలని సూచించారు. రైతుబంధు ఖమ్మం జిల్లా సమన్వయకర్త నల్లమల వెంకటేశ్వరరావు, టీఆర్ఎస్ నాయకులు దార వెంకటేశ్వరరావు, నల్లమోతు వెంకటనారాయణ, మెడా మోహన్‌రావు, ఎస్డీ రసూల్, సత్తి నాగేశ్వరరావు, సర్పంచ్ పూసం వెంకటేశ్వర్లు, గుగులోతు ప్రవీణ్‌ప్రకాష్ పాల్గొన్నారు.

పెళ్లయిన నాలుగో రోజే అదృశ్యం

ఏన్కూరు: ఓ యువతి వివాహమైన నాలుగో రోజునే ఇంటి నుంచి వెళ్లిపోయింది. భద్రాద్రి కొత్తగూడెం జిల్లా అశ్వాపురం మండలానికి చెందిన కావ్యశ్రీకి ఏన్కూరు ఇందిరానగర్ కాలనీకి చెందిన సాయితో ఈ నెల 20 వివాహం జరిగింది. అయితే, 23న రాత్రి అర్ధరాత్రి సాయి ఇంటి నుంచి కావ్యశ్రీ వెళ్లిపోయింది. అప్పటి నుంచి బంధువుల ఇళ్లలో వెతికినా ఆచూకీ లేదు. కావ్యశ్రీ తల్లి గురువారం పోలీసులకు ఫిర్యాదు చేయగా, కేసు నమోదు చేసినట్లు ఎస్ఐ బాదావత్ రవి తెలిపారు.

దాడి ఘటనలో ఎంపీటీసీ అరెస్ట్



నిందితుడిని చూపుతున్న పోలీసులు

చుంచుపల్లి: భూ వివాదం నేపథ్యంలో జరిగిన ఘర్షణ కేసులో మండలంలోని సర్వారం ఎంపీటీసీ బానోత్ విజయ్‌ను పోలీసులు అరెస్ట్ చేశారు. ఎస్ఐ సుమన్ కథనం ప్రకారం.. చుంచుపల్లి పోలీస్ స్టేషన్ పరిధిలో గత నెలలో భూ వివాదంలో గుగులోతు తారాబాయి అనే మహిళ కుమారుడు సందీప్‌ను ఎంపీటీసీ కర్రతో కొట్టి గాయపర్చాడు. బాధితుల ఫిర్యాదు మేరకు పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టారు. నిందితుడు పరారు కాగా, బుధవారం రాత్రి వరంగల్‌లో అరెస్ట్ చేశారు. రిమాండ్ నిమిత్తం గురువారం కోర్టుకు తరలించారు. బానోత్ విజయ్‌పై గతంలో కూడా కొన్ని కేసులు నమోదు కావడంతో ఉన్నతాధికారుల ఆదేశాలతో అతనిపై రౌడీషీట్ తెరుస్తామని ఎస్సై తెలిపారు.

బైక్ దొంగలు అరెస్ట్

ఏడు ద్విచక్రవాహనాలు స్వాధీనం

మణుగూరు రూరల్ : బైక్ దొంగతనాలకు పాల్పడుతున్న ముగ్గురు వ్యక్తులను పోలీసులు అరెస్ట్ చేశారు. మణుగూరు పోలీస్ స్టేషన్‌లో గురువారం ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో డీఎస్పీ రాఘవేంద్రరావు వివరాలు వెల్ల డించారు. డీఎస్పీ కథనం ప్రకారం... మణుగూరులోని అభయాంజనేయస్వామి ఆలయం క్రాస్ రోడ్డు వద్ద సీఐ ముత్యం రమేష్, ఎస్సై బట్ట పురుషోత్తం వాహనాల తనిఖీ చేపట్టారు. ఈ క్రమంలో బైక్‌పై వెళ్తున్న ముగ్గురు వ్యక్తులను ఆపి వాహన ధ్రువీకరణ పత్రాలు అడుగుతుండగా పారిపోయేందుకు ప్రయత్నించారు. వారిని పట్టుకుని విచారించగా.. ఎస్‌కే అక్బర్, తెడ్డు మహేష్, మరొకరు మైనర్ బాలుడిగా తేలింది. వీరు ముగ్గురు జల్సాలకు అలవాటు పడి మణుగూరులోని పీవీకాలనీ, అశోక్‌నగర్, సమితిసింగారం, పూలమార్కెట్, రాజీవ్‌గాంధీ నగర్ ప్రాంతాల్లో దొంగతనాలకు పాల్పడుతున్నారు. అపహరించిన బైక్‌ల్లో ఒక వాహనాన్ని విక్రయించి, సంబంధించిన సొమ్ము కోసం భద్రాచలం వెళ్తుండగా పోలీసులు పట్టుకున్నారు. అపహరించి పీవీ కాలనీ వాటర్ ట్యాంక్ సమీపంలోని అటవీ ప్రాంతంలో దాచిపెట్టిన మరో ఏడు బైక్‌లను పోలీసులు స్వాధీనం చేసుకున్నారు. నిందితులను రిమాండ్ నిమిత్తం కోర్టుకు తరలించామని డీఎస్పీ తెలిపారు.

గంజాయి తరలిస్తున్న వ్యక్తులు అరెస్ట్

భద్రాచలం అర్బన్: నిషేధిత గంజాయి తరలిస్తున్న ఇద్దరు వ్యక్తులను గురువారం ఎక్సైజ్ అండ్ ప్రొహిబిషన్ అధికారులు అరెస్ట్ చేశారు. భద్రాచలం పట్టణంలో ఎక్సైజ్ అధికారులు వాహనాల తనిఖీ నిర్వహించారు. ఈ క్రమంలో చింతూరు(ఆంధ్రప్రదేశ్) నుంచి భద్రాచలం మీదుగా హైదరాబాద్‌కు ఎండు గంజాయి తరలిస్తుండగా గోదావరి వంతెన సమీపంలో పట్టుకున్నారు. వారి నుంచి 4.5 కిలోల గంజాయి, పల్సర్ బైక్, రెండు మొబైల్ ఫోన్లను స్వాధీనం చేసుకున్నారు.

పందెంరాయుళ్ల అరెస్ట్

అశ్వారావుపేటరూరల్: మండల పరిధిలోని బచ్చువారిగూడెం గ్రామ సమీపంలో ఉన్న పుల్లేటి చెరువు వద్ద నిర్వహిస్తున్న కోడి పందేల స్థావరంపై గురువారం పోలీసులు దాడి చేశారు. కోడి పందేలు ఆడుతున్న ఐదుగురు వ్యక్తులను అదుపులోకి తీసుకున్నారు. వారి నుంచి రూ.3వేల నగదు, రెండు కోడికత్తులు, రెండు కోడిపుంజులను స్వాధీనం చేసుకున్నారు. కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై బి.రాజేశ్ కుమార్ తెలిపారు.

కస్టడీ నుంచి పారిపోయిన నిందితుడు

భద్రాచలంఅర్బన్: భద్రాచలం పట్టణంలో బుధవారం మధ్యాహ్నం అక్రమంగా గంజాయి తరలిస్తున్న ఇద్దరు వ్యక్తులను ఎక్సైజ్ శాఖ అధికారులు పట్టుకున్నారు. ఇద్దరినీ గురువారం కోర్టులో హాజరుపరిచేందుకు తీసుకెళ్తుండగా పోలీసుల కళ్లుగప్పి కర్ణాటక రాష్ట్రానికి చెందిన రహీం అనే ముద్దాయి పారిపోయాడు. దీనిపై భద్రాచలం పోలీసు స్టేషన్‌లో గురువారం ఫిర్యాదు చేయగా, పోలీసులు కేసు నమోదు చేశారు. కాగా గంజాయి తరలిస్తూ పట్టుబడిన ఘటనకు సంబంధించిన వివరాలు ఎక్సైజ్ శాఖ అధికారులు ఇప్పటివరకు వెల్లడించకపోవడం గమనార్హం.

యువకుడు ఆత్మహత్య..?

ఇల్లెందురూరల్: మండలంలోని ఒడ్డుగూడెం గ్రామానికి చెందిన యువకుడు గోగుల సాయి (17) గురువారం సాయంత్రం నుంచి కనిపించకపోవడంతో కుటుంబ సభ్యులు గాలింపు చేపట్టారు. గ్రామ సమీపంలోని వ్యవసాయబావిలో వద్ద అతని చెప్పులు కనిపించడంతో బావిలో దూకి ఆత్మహత్య చేసుకున్నట్లు కుటుంబ సభ్యులు, బంధువులు అనుమానిస్తున్నారు. గ్రామానికి చెందిన గజ ఈతగాళ్లు బావిలో గాలింపు కొనసాగిస్తున్నారు. గతేడాది సోదరుడు ఆత్మహత్య చేసుకున్న నాటి నుంచి సాయి ముభావంగా ఉంటున్నాడని, ఇటీవల జరిగిన ఇంటర్ పరీక్షలకు కూడా గైర్హాజరయ్యాడని కుటుంబ సభ్యులు చెబుతున్నారు.

గాలివాన బీభత్సం

ఎగిరిపోయిన ఇళ్ల పైకప్పులు



లక్ష్మీపురంలో నేలకొరిగిన విద్యుత్ ట్రాన్స్‌ఫార్మర్



ఎగిరిపోయిన ఇంటి పైకప్పు

బూర్గంపాడు: బూర్గంపాడు మండలంలో గురువారం గాలివాన బీభత్సం సృష్టించింది. మధ్యాహ్నం సమయంలో ఒక్కసారిగా వచ్చిన గాలివానకు లక్ష్మీపురం, మోరంపల్లిబంజర గ్రామాలలో ఇళ్ల పైకప్పులు లేచిపోయాయి. దీంతో ఇళ్లలోని సామగ్రి వర్షానికి తడిసియింది. కొన్నిచోట్ల గాలి ఉధృతికి చెట్లు నేలకొరిగాయి. బూర్గంపాడు -భద్రాచలం రహదారిలో పలుచోట్ల రాష్ట్రీయ రహదారిపై చెట్లు విరిగిపడి రాకపోకలకు అంతరాయం కలిగింది. లక్ష్మీపురంలో విద్యుత్ స్తంభాలు నేలమట్టమయ్యాయి. పలుచోట్ల విద్యుత్ ట్రాన్స్‌ఫార్మర్లు కుప్పకూలాయి.

పిడుగుపాటుకు దూడ మృతి

అశ్వాపురం: మండల పరిధిలోని జగ్గారం గ్రామంలో గురువారం సాయంత్రం ఉరుములు, మెరుపులతో కూడిన వర్షం కురిసింది. పిడుగపాటుతో గ్రామంలోని సోడె భద్రయ్య ఇంటి ఆవరణలో కట్టేసిన గేదె దూడ మృతి చెందింది. పక్కనే ఉన్న బైక్ స్వల్పంగా ధ్వంసమైంది. సర్పంచ్ సున్నం రాంబాబు, బీఆర్ఎస్ నాయకులు కంసాని సత్యనారాయణ, గాలి బ్రహ్మానందరెడ్డి సంఘటనా స్థలాన్ని పరిశీలించారు.

ప్రవాహ నమోదు గుర్తింపునకు పరికరాలు



గుండేటివాగు వద్ద సీసీ కెమెరా

అశ్వారావుపేటరూరల్: మండలంలోని కుదుములపాడులోని గుండేటి వాగు వర్షాకాలంలో ఏ మేరకు ప్రవహిస్తుందో నమోదు చేసేందుకు నీటి పారుదల శాఖ ఆధ్వర్యంలో ప్రత్యేక పరికరాలు, సీసీ కెమెరా ఏర్పాటుచేశారు. ఔట్ ఫ్లో తెలుసుకునేందుకు ఆటోమెటిక్ వాటర్ లెవల్ రికార్డర్‌ను అమర్చారు. వాగు ప్రవాహం ఎంత వస్తోంది, ఔట్ ఫ్లో ఎలా ఉందో తెలుసుకుని ప్రమాదాల నివారణకు ముందస్తు చర్యలు చేపట్టేందుకు ఈ పరికరాలు ఉపకరిస్తాయని అధికారులు వెల్లడించారు. వారం రోజుల్లో గుమ్మడవల్లి వద్ద పెదవాగు సమీపాన కూడా వీటిని ఏర్పాటు చేస్తామని ఇరిగేషన్ డీఈఈ కృష్ణ, ఏఈఈ కేఎస్‌బీ.కృష్ణ తెలిపారు.

బీజేపీని ఓడించడమే కర్తవ్యం

- కమ్యూనిస్టులు స్వతంత్రంగా పోటీ చేస్తే మద్దతు
- ప్రజాపంథా రాష్ట్ర కార్యదర్శి పోటు రంగారావు

ఖమ్మంమయూరిసెంటర్: ఎన్నికలు వచ్చినప్పుడే తమ పార్టీ చర్చించి విధివిధానాలను ప్రకటిస్తుందని.. ప్రస్తుతం దేశానికి బీజేపీతో పొంచి ఉన్న ప్రమాదాన్ని దృష్టిలో ఉంచుకుని ముందుగానే ఆ పార్టీని ఓడించాలనే స్పష్టమైన నిర్ణయం తీసుకున్నట్లు సీపీఐ(ఎంఎల్) ప్రజాపంథా రాష్ట్ర కార్యదర్శి పోటు రంగారావు వెల్లడించారు. ఖమ్మంలోని రామనర్సయ్య విజ్ఞానకేంద్రంలో గురువారం ఏర్పాటుచేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ మళ్లీ బీజేపీ అధికారంలోకి వస్తే యువత, ప్రజలకు పెనుముప్పు వాటిల్లుతుందన్నారు. కాగా, ఖమ్మంలో జరిగిన పార్టీ ఏడో రాష్ట్ర మహాసభల్లో బీజేపీని ఓడించాలని తీర్మానించినట్లు తెలిపారు. కాగా, కమ్యూనిస్టు పార్టీలు ఎన్నికల సమయంలో ఏదో ఒక బూర్జువ పార్టీతో పొత్తులు పెట్టుకుంటాయని, అలా కాకుండా స్వతంత్రంగా పోటీ చేస్తే తమ మద్దతు ఇస్తుందన్నారు. తెలంగాణ ఏర్పడి పదేళ్లయినా ప్రజల ఆకాంక్షలు నెరవేరనందున వచ్చేనెల 2 నుండి 12వ తేదీ వరకు దీక్షా దివస్ నిర్వహించనున్నట్లు తెలిపారు. పది రోజుల పాటు కార్యక్రమాలు చేపట్టి, 12న జిల్లా కేంద్రాల్లో ప్రదర్శనలు, దీక్షలు నిర్వహిస్తామని వెల్లడించారు. పార్టీ రాష్ట్ర ఏడో మహాసభలు ఈనెల 22 నుండి 24వ తేదీ వరకు డీవీకే.నగర్‌లో విజయవంతంగా జరిగాయని తెలిపారు.